ప్రజాశక్తి
బుధవారం 24 ఏప్రిల్ 2024
8 పేజీలు
ఎన్‌టిఆర్
కృష్ణా

కళ్లం నామినేషన్ సందర్భంగా జరిగిన సభలో అభివాదం చేస్తున్న ఇండియా వేదిక నేతలు మధు, వైవి. వి.ఉమా, సంజీవరెడ్డి, తాతయ్య తదితరులు

ఫిరాయింపుదారులను ఓడించండి

సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు
కళ్లం నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ, సభ

ప్రజాశక్తి - గన్నవరం : గన్నవరంలో వైసిపి, టిడిపిలు పార్టీ ఫిరాయించిన వారికే సీట్లు ఇచ్చాయని సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు విమర్శించారు. కాసుల కోసం, పదవుల కోసం పార్టీలు మారే వీరికి ఓటేసినా ఆ తర్వాత ఇప్పుడున్న పార్టీలో ఉంటారనే గ్యారెంటీ లేదన్నారు. కాంగ్రెస్, సిపిఐ, ఇండియా వేదిక బలపరచిన సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్ సందర్భంగా మంగళవారం గన్నవరంలో ర్యాలీ, సభ నిర్వహించారు. సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి.లక్ష్మణస్వామి అధ్యక్షతన జరిగిన సభలో మధు మాట్లాడుతూ ఫిరాయింపులకు పాల్పడే వైసిపి, టిడిపి అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై పోరాటాలు సాగించిన చింతపల్లి పాపారావు, అట్లూరి శ్రీమన్నారాయణ వారసత్వాన్ని కమ్యూనిస్టులు కొనసాగిస్తారన్నారు. ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు వింతా సంజీవరెడ్డి మాట్లాడుతూ దేశానికి ఇండియా వేదిక అవసరం ఎంతో

(మిగతా 2లో)

ర్యాలీలో ప్రత్యేక వాహనంపై నుండి అభివాదం చేస్తున్న సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మచిలీపట్నం ఎంపి అభ్యర్థి గొల్లు కృష్ణ తదితరులు

భారీగా నామినేషన్లు

మొత్తం 55, ఎన్‌టిఆర్‌లో 27, కృష్ణాలో 28

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో మంగళవారం 55 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో మొత్తం 27 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ పశ్చిమకు ఐదు, సెంట్రల్‌కు ఐదు, తూర్పుకు నాలుగు, మైలవరంనకు మూడు, నందిగామకు ఒకటి, తిరువూరుకు రెండు, జగ్గయ్యపేటకు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. విజయవాడ పశ్చిమకు వైసిపి తరపున అసిఫ్ షేక్ రెండు సెట్లు, బిఎస్‌పి తరపున మద్దిరాల భూషణ రాజు, జై భారత్ నేషనల్ పార్టీ తరపున పోతిన వెంకట రామారావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నక్కల సాయిబాబు, ఇండియన్ ముస్లిం లీగ్ అభ్యర్థిగా షేక్ కాజా వలి ఒక్కో సెట్ నామినేషన్లు సమర్పించారు. సెంట్రల్‌కు టిడిపి తరపున బోండా సుజాత, బోండా ఉమా మహేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా కొణిజేటి ఆదినారాయణ, బి.వెంకట సాయి లక్ష్మి గణేష్, బొప్పన గాంధీ ఒక్కో సెట్ నామినేషన్లు వేశారు. తూర్పుకు స్వతంత్ర అభ్యర్థులుగా సుమ సుదర్శన, ఎం.భార్గవ్, స్టూడెంట్స్ యునైటెడ్ ఫర్ నేషన్ పార్టీ అభ్యర్థిగా వెంకటరెడ్డి గంగిరెడ్డి, జన వాహిని పార్టీ అభ్యర్థిగా ఎస్ఎన్ వరప్రసాద బాబు దాస్యం ఒక్కో సెట్ వేశారు. మైలవరంనకు జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి ఓర్సు రామారావు, స్వతంత్ర అభ్యర్థులుగా నూనె సుధీర్ కుమార్ రెడ్డి, చింతపల్లి దాస్ ఒక్కో సెట్ వేశారు.

(మిగతా 2లో)

నామినేషన్ వేస్తున్న నందిగామ టిడిపి అభ్యర్థి తంగిరాల సౌమ్య

నది ద్వారా మద్యం అక్రమ రవాణా

ముఠా గుట్టురట్టు చేసిన సెబ్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల సిబ్బంది కళ్లుగప్పి కష్ణా నదీ మార్గం ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా మార్గం వెంబడి రవాణా చేసి జగ్గయ్యపేట ప్రాంతానికి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో తెలంగాణ మద్యాన్ని కొనుగోలు చేసి నది వెంబడి జయంతిపురంలోకి తరలించడానికి రావిరాల నది నుండి ద్విచక్ర వాహనం ద్వారా సరఫరాకు యత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. జయంతిపురం పరిసర ప్రాంతాలకు తెలంగాణ రాష్ట్రం మద్యాన్ని సరఫరా చేసే ముఠా ప్రయత్నాన్ని జగ్గయ్యపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వమ్ముచేశారు. జయంతిపురం గ్రామానికి చెందిన బాణావతు కోటేశ్వరరావు (బోడ్యా), బాణావతు మణికంఠ, వేదాద్రి గ్రామానికి చెందిన మూడా సేవ మూడు ద్విచక్ర వాహనాలపై 407 మద్యం బాటిళ్లను (180 ఎంఎల్) తరలించేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి వద్ద నుండి సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, వేదాద్రి గ్రామానికి చెందిన మూడ సేవ పరారఅయ్యారని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ మణికంఠ రెడ్డి తెలిపారు.

స్వాధీనం చేసుకున్న మద్యం

సిపిపై ఎన్నికల సంఘం వేటు

సిఎంపై దాడి ఘటన నేపథ్యంలో...

ప్రజాశక్తి-విజయవాడ

ఈనెల 13న విజయవాడ సింగ్‌నగర్లో సిఎం జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన రాయి దాడి ఘటన నేపథ్యంలో ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. ఇద్దరు పోలీసు అధికారులపై బదిలీ వేటు వేసింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ కాంతిరాణాటాటా, ఇంటెలిజెన్స్ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులను బదిలీ చేసింది. తక్షణమే ఆ ఇద్దరి అధికారులను విధుల నుంచి తొలగించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. వారికి ఎన్నికలతో ఎటువంటి సంబంధం లేని విధులను అప్పగించాలని ఆదేశించింది. ఈసికి వచ్చిన పలు పిర్యాదుల ఆధారంగా వారిద్దరిపై వటు వేసినట్లు తెలిసింది.

పేటలో హ్యాట్రిక్ ఘనులు

- మంత్రి, ప్రభుత్వ విప్ పదవులను అలంకరించిన నెట్టెం, సామినేని
- భార్యాభర్తలకు అవకాశం ఇచ్చిన జగ్గయ్యపేట

కథనం మధ్య పేజీలో

క్లౌడ్ అప్లికేషన్లో విస్తృత అవకాశాలు

గ్లోబల్ లాజిక్ ప్రాజెక్ట్ మేనేజర్ హరి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : కంప్యూటర్ రంగ విద్యార్థులు క్లౌడ్ అప్లికేషన్స్ ద్వారా విస్తృతమైన ఉపాధి అవకాశాలను పొందొచ్చని గ్లోబల్ లాజిక్ ప్రాజెక్ట్ మేనేజర్ పసుపులేటి హరి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో మంగళవారం క్లౌడ్ అప్లికేషన్స్‌పై విద్యార్థులకు ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హజరైన పసుపులేటి హరి మాట్లాడుతూ కంప్యూటర్స్ రంగంలో డేటాను భద్రపరించే క్రమంలో అనేక నూతన పరిశోధనలు ముందుకు సాగుతున్నాయన్నారు. ఆ క్రమంలో క్లౌడ్ అప్లికేషన్ చాలా కీలకంగా సమాచార భద్రపరిచేందుకు తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు మారుతున్న కాలానుగుణంగా కంప్యూటర్స్‌లో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిపై పట్టు సాధించాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కంప్యూటర్స్ రంగం లేకుండా నేడు ప్రపంచ అభివృద్ధిని ఊహించలేమన్నారు. విద్యార్థులు మారుతున్న పరిస్థితులు, నూతన ఆవిష్కరణల తదితర అంశాలపై పట్టు సాధించి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పిఎల్ రమేష, డాక్టర్ కే రామకష్ణ, విభాగాధిపతి పీ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సాధారణ పరిశీలకులుగా మంజూ రాజ్‌పాల్

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టీఆర్ జిల్లాలోని తిరువూరు, విజయవాడ తూర్పు, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సాధారణ అబ్జర్వర్‌గా నియమితులైన ఐఎఎస్ అధికారి మంజూ రాజ్‌పాల్ మంగళవారం విజయవాడ నగరానికి విచ్చేశారు. స్థానిక మునిసిపల్ గెస్ట్ హౌస్ వద్ద మంజూ రాజ్‌పాల్‌కు కలెక్టర్ ఎస్.డిల్లీరావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ప్రతి కుటుంబానికీ ఉపాధి హామీ పనులు కల్పించాలి

కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ ఆదేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తాగునీరు, విద్యుత్ సరఫరా పరిస్థితులు, ఉపాధి హామీ కింద పనుల కల్పన అంశాలపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి సిఎస్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితులు, తాగునీటి చెరువుల నింపే కార్యక్రమం గురించి సీఎస్ వివరించారు. కాలువల ద్వారా నీరు విడుదల చేయడం ద్వారా జిల్లాలో దాదాపు తాగునీటి చెరువులన్ని నింపినట్లు కలెక్టర్ తెలిపారు. గుడివాడ, నందివాడ ప్రాంతాల్లో కొంతమేర చెరువులు నిండాల్సి ఉందని, ఈ ప్రాంతానికి మరో నాలుగు రోజులు కాలువల ద్వారా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు. జిల్లాలో వేసవిలో తాగునీటి సమస్య లేదన్నారు. జిల్లాలో ఉపాధి హామీ కింద 2024- 25లో

ఇప్పటివరకు 14 లక్షల పని దినాలు కల్పించి 46.5 శాతం లక్ష్యసాధన సాధించినట్లు తెలిపారు. రోజుకు సరాసరి కూలి రూ.261.52 చెల్లిస్తున్నట్లు, ప్రతిరోజు సరాసరి లక్ష మంది వరకు జిల్లాలో పనులకు హాజరవుతున్నట్లు తెలిపారు. తొలుత కలెక్టర్ ఇరిగేషన్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ కింద అర్హత గల ప్రతి కుటుంబానికి పనులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, డ్వామా పిడి జీవి సూర్యనారాయణ, మచిలీపట్నం, ఉయ్యూరు మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, పి వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డి ఈ మురళి పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిలేకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లాలో తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు.... రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. విజయవాడలోని సీఎస్ క్యాంప్ కార్యాలయం నుండి మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె ఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ డిల్లీరావు.. వివిధ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ వేసవిని దష్టిలో పెట్టుకొని తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగరపాలక సంస్థ, మున్సిపల్ ఏరియా, గ్రామపంచాయతీ పరిధిలో అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతిరోజు తాగునీరు సరఫరా చేస్తున్నామని జిల్లాలో ఎటువంటి ఇబ్బంది లేదని తెలిపారు.వేసవి ఎండల తీవ్రత దష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. సాంకేతికంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించేలా చర్యలు తీసుకున్నామన్నారు.జిల్లాలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని, గరిష్ట వేతనం అందేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఎక్కువ మంది కూలీలకు పని కల్పిస్తున్నామన్నారు. పనులు జరుగుతున్న చోట వేసవి దష్ట్యా కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించామని జిల్లా కలెక్టర్ డిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. ఎస్. జవహర్ రెడ్డికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సునీత, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ డి.వి.రమణ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దావా సమను

మహారాజశ్రీ తూర్పుగోదావరి జిల్లా అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 131/2022

Between:
M.G.R. రైస్ ఇండస్ట్రీస్, పొలమూరు, Represented by its Managing Partner కర్రి చక్రవర్తి. -వాది

AND

1. శ్రీ దివ్యజ్యోతి ట్రేడర్స్, Represented by its ప్రొప్రయిటర్ దర్శి గురవయ్య
2. దర్శి గురవయ్య -ప్రతివాద్దు

To:
1. శ్రీ దివ్యజ్యోతి ట్రేడర్స్, Represented by its ప్రొప్రయిటర్, దర్శి గురవయ్య, 53 సం॥లు, వ్యాపారం, C/o. కొలిశెట్టి సాంబశివరావు, డోర్ నెం. 11-55-36/2, 1వ ఫ్లోర్, మార్వాడి గుడి వీధి, కెనాల్ రోడ్, విజయవాడ, కృష్ణా జిల్లా, విజయవాడ JCJC.
2. దర్శి గురవయ్య, 53 సం॥లు, వ్యాపారం, ప్రొప్రయిటర్, శ్రీ దివ్య జ్యోతి ట్రేడర్స్, C/o. కొలిశెట్టి సాంబశివరావు, డోర్ నెం. 11-55-36/2, 1వ ఫ్లోర్, మార్వాడి గుడి వీధి, కెనాల్ రోడ్, విజయవాడ, కృష్ణా జిల్లా, విజయవాడ JCJC. -ప్రతివాద్దు

పై నెంబరు దావా గ్రంధమునకు సంబంధించి ప్రతివాద్దు యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 26-06-2024 వాయిదాగా అయి ఉన్నది. కాబట్టి మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

టి.వి.నారాయణరెడ్డి
వాది తరపు అడ్వకేట్, అనపర్తి

మహారాజశ్రీ 14వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
GWOP No.22/2024
(In The Matter of Permission to alienate Minor s Property by name Burugula Santoshi Sri Vyshnavi)

Between
బూరుగుల శ్రీదేవి ...పిటీషనర్
మరియు
నిల్ ...రెస్పాండెంట్

పై నెంబరు GWOP లో మైనరైన బూరుగుల సంతోషి శ్రీ వైష్ణవి గారి వాటా ఆస్తిని విక్రయించుటకు అనుమతి ఇప్పించవలసినదిగా తల్లి మరియు కో ఓనర్ మరియు గార్డియన్ అయిన బూరుగుల శ్రీదేవి గారు ఈ పిటీషన్‌ను దాఖలు చేయగా సదరు వారికి పర్మిషన్ ఇవ్వటం గురించి ఎవరికైన అభ్యంతరములు వున్న యెడల ది.30-05-2024 వ తేదిన ఉ.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమకు గల అభ్యంతరములు తెలుపుకొన వలెను. ఎటువంటి అభ్యంతరములు రాని ఎడల శ్రీ కోర్టువారు తదుపరి ఉత్తర్వులు జారీచేయగలరని తెలియపర్చడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వాయిదా తేది:30-05-2024 **ఇట్లు**

Ch.Damodara Rao,
పిటిషనర్ తరపు న్యాయవాది,
విజయవాడ-1
Ph.No.9393999545.

IN THE COURT OF THE VIII ADDL DISTRICT JUDGE-CUM-MOTOR VEHICLES ACCIDENT TRIBUNAL AT VIJAYAWADA
MVOP:524/2018

Between:
Kota Jaya Prakash ...Petitioner
V/s
1)M.Krishnaiah & others ...Respondents

To
(R4) Pasina China Appanna,
S/o Dasu, R/o 2-15-33, M.V.P.Colony,
Visakhapatnam,

పై నెంబరు దావాలో రెస్పాండెంట్ నెం.4 ఐన మీరు హాజరు నిమిత్తము ది.30-04-2024 కు వాయిదా అయివున్నది. కావున పైన తెలిపిన రెస్పాండెంట్ నెం.4 ఐన మీరు పైన తెలిపిన కోర్టు వారి ముందు ఉదయం గం.10-30 ని.లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపుకోగలరు. లేని యెడల మీకు పై దావానందు ఎటువంటి అభ్యంతరములు లేనట్లుగా భావించి దావాను మీ పరోక్షమున తీర్మానించబడును.

//శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం//

వాయిదా తేది:30-04-2024

R.V.Ramakrishna,
J.Dilip Kumar,
Advocates,
Vijayawada,
PH:9440175910

మొదటి పేజీ తరువాయి

సభలో మాట్లాడుతున్న పి.మధు

ఫిరాయింపుదారులను ఓడించండి

ఉందన్నారు. ఆ వేదికతోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అభివద్ధి జరగలేదని, ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ ఉక్కుపై సిఎం జగన్మోహనరెడ్డి రోజుకో అబద్ధం చెబుతున్నారని విమర్శించారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందని విమర్శించారు. నవరత్నాల పేరుతో ప్రజల నెత్తిన భారాలు వేశారన్నారు. బిజెపితో చేతులు కలిపిన టిడిపి, జనసేన పార్టీలు ఎన్నికల తర్వాత లేకుండా పోతాయని జోస్యం చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మచిలీపట్నం ఎంపి అభ్యర్థి గొల్లు కష్ణ, గన్నవరం అసెంబ్లీ సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి తాతయ్య మాట్లాడుతూ మళ్లీ బిజెపిది విష కౌగిలి అన్న విషయం టిడిపి గుర్తించలేకపోతోందన్నారు. బిజెపితో రాష్ట్రంలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీ అన్నట్లు జగన్ తీరు ఉందన్నారు. గన్నవరం పోరాటాల గడ్డ అని, ఎందరో మహనీయులు తమ ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు. వారి ఆశయాలకు అనుగుణంగా పోరాటాలను ముందు తీసుకువెళ్తామన్నారు. సిపిఎం గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గన్నవరంలో ఇప్పటికీ చెత్త డంపింగ్ యార్డ్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ సమస్యపై అనేకసార్లు ఆందోళన చేసినా ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కరించలేదని అన్నారు. పోలవరం కాల్వపై శాశ్వతంగా మోటార్లు ఏర్పాటు చేసేందుకు రైతుల పక్షాన ఉద్యమిస్తామన్నారు. మల్లవల్లిలో భూముల సమస్య, పరిశ్రమల సమస్యపై కమ్యూనిస్టులు పోరాటం చేశారని గుర్తుచేశారు. ఏలూరు కాల్వ ప్రక్షాళనకు చర్యలు తీసుకోలేదన్నారు. విద్యుత్, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి, పక్కా ఇళ్ల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు ఉద్యమిస్తామని తెలిపారు. కాంగ్రెస్ మచిలీపట్నం ఎంపి అభ్యర్థి గొల్లు కష్ణ మాట్లాడుతూ తన స్వగ్రామం తేలప్రోలు అని అన్నారు. గన్నవరం నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి గీటురాయిగా ఉంటుందన్నారు. పనిచేయని వారికి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ప్రజలను మోసం చేసిన వైసిపి, టిడిపిలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. దేశ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టులతో కలిసి ముందుకు సాగడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.ఉమామహేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నార్ల వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు, రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు, కాట్రగడ్డ స్వరూపరాణి, కాంగ్రెస్ నాయకులు సుంకర వీరభద్రరావు, సిపిఎం బాపులపాడు, ఉంగుటూరు మండలాల కార్యదర్శులు బేతా శ్రీనివాసరావు, అజ్మీర వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు.

కోలాహలంగా ర్యాలీ

సభ అనంతరం గన్నవరంలో ర్యాలీ నిర్వహించారు. ఇండియా వేదికకు చెందిన వందలాది మంది జెండాలు, ప్లకార్డులు చేతబూని జాతీయ రహదారిపై కదం తొక్కారు. ర్యాలీ ముందు భాగాన సిపిఎం రాష్ట్ర పూర్వ కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధుతోపాటు ఇండియా వేదిక నేతలు ఉన్నారు. చింతపల్లి పాపారావు భవనం వద్ద ప్రారంభమైన ర్యాలీ గాంధీబొమ్మ సెంటర్, శాంతి థియేటర్ సెంటర్, బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. అక్కడి నుంచి అప్సర సెంటర్ మీదుగా ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌కు చేరింది. ప్రజానాట్యమండలి కళాకారులు, డప్పు కళాకారులు తమ విన్యాసాలతో సందడి చేశారు. సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గొల్లు కష్ణ ప్రత్యేక వాహనంపై నిలబడి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సుత్తి కొడవలి నక్షత్రం, హస్తం గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్ వేశారు.

భారీగా నామినేషన్లు

నందిగామకు టిడిపి తరపున తంగిరాల సౌమ్య ఒక సెట్ వేశారు. తిరువూరుకు వైసిపి తరపున నల్లగట్ల సుధారాణి, బిఎస్‌పి తరపున లాక్కేపోగు వందన్ కుమార్ ఒక్కో సెట్ వేశారు. జగ్గయ్యపేటకు టిడిపి తరుపున శ్రీరామ్ శ్రీదేవి, బిఎస్‌పి తరపున కె. ప్రభుదాస్, జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా శ్రీరామ రామకష్ణ, స్వతంత్ర అభ్యర్థులుగా జె.ఆనందరావు, బి. ప్రకాష్ రావు, కె. బుజ్జిబాబు, వేల్పుల విజయ్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే కృష్ణాజిల్లాలో మంగళవారం మొత్తం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటుకు జనసేన పార్టీ తరుపున వల్లభనేని అనుదీప్ రెండు సెట్లు, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరపున ఆదోతు తులసీరామ్ 2 సెట్లు, స్వతంత్ర అభ్యర్థులు సింహాద్రి రామ్ చరణ్, వల్లభనేని నాగ పవన్ కుమార్, జై భారత్ నేషనల్ పార్టీ తరపున అంబళ్ళ రాజ్ కుమార్ ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు వేశారు. గుడివాడ అసెంబ్లీకి టిడిపి తరపున రాము వెనిగండ్ల ఒక సెట్, పెడనకు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున రేవతి దేవి సబ్బిశెట్టి ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మచిలీపట్నం అసెంబ్లీకి వైసిపి తరపున పేర్ని వాకా సాయి కష్ణ మూర్తి మూడు సెట్లు, స్వతంత్ర అభ్యర్థులు ఈడే భాస్కరరావు, సునీల్ బాబు కోటప్రోలు ఒక్కోసెట్, తెలుగు రాజాధికార సమితి పార్టీ తరపున ఆదోతు తులసీరామ్ 2 సెట్లు వేశారు. అవనిగడ్డకు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ముంగర వెంకట నాంచారయ్య ఒక సెట్, బిఎస్‌పి తరపున నాగేశ్వరరావు గుంటూరు ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా గిరిధర్ నాయుడు నాదెళ్ల ఒక సెట్ వేశారు. పామర్రుకు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున మంగం రాజ మనోహర్ ఒక సెట్, పెనమలూరుకు తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరపున శశిధర్ మరీదు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.


చేపల చెరువులకు మళ్లిస్తున్న నీరు

మోటార్ల ద్వారా తాగునీరు తరలింపు

అధికారుల ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి-పెడన: వేసవి కాలంలో ప్రజలు దాహార్తి తీర్చేందుకు కెనాల్, ఛానళ్ల ద్వారా విడుదల చేసిన నీటిని మోటార్ల ద్వారా తరలిస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నీటిని ఆయా మండలాల్లోని శివారు గ్రామాల వరకు ఉన్న మంచినీటి చెరువులకు నీటిని నింపేందుకు ప్రత్యేక ప్రణాళిక ఉన్నతాధికారి రూపొందించారు. చేపల, రొయ్యల చెరువులకు తోడకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ క్రింది స్థాయి అధికారులను ప్రత్యేక టీములుగా ఏర్పాటు చేసి పర్యవేక్షించాల్సిన బాధ్యతలు అప్పగించారు. అవకతవకలు అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆచరణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. సాక్షాత్తు జిల్లా కేంద్రానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెడన మండలంలోని బంటుమిల్లి మెయిన్ కెనాల్ నుండి నిబంధనలకు తూట్లు పడుతున్న సంఘటన చోటు చేసుకోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతుంది. సాక్షాత్తు ఆయా శాఖల అధికారులు అనుమతులతోనే నీటిని తోడుతున్నట్లు సిబ్బంది చెప్పడం గమనార్హం.

పెడన మండలంలోని కమలాపురం నుంచి చెన్నూరు వెళుతుండగా బంటుమిల్లి మెయిన్ కెనాల్ నుంచి ఆర్ అండ్ బి రోడ్డు ఎడమవైపు ఉన్న భారీ చెరువులకు నాలుగు విద్యుత్ మోటార్లతో నీటిని తోడేస్తున్నారు. దాదాపు 5 నుంచి 15 ఎకరాల చెరువులకు ఇలా రేయింబవళ్లు మోటార్లతో నీటిని తోడుతున్నారు. అలాగే చెన్నూరు గ్రామంలోని మంచినీళ్ళ చెరువు ఆనుకుని ఉన్న రొయ్యల చెరువులకు ఆయిల్ ఇంజన్లతో ఈ నీటిని తోడేస్తున్నారు. అంతేకాకుండా చెన్నూరు నుంచి గొల్లగూడెం వెళ్లేదారిలో గ్రామంలోని ఓ బడా బాబుకు చెందిన రెండు రొయ్యల చెరువులకు విద్యుత్ మోటార్ల ద్వారా అంతేకాకుండా కొప్పల్లి పంచాయతీ రక్షిత మంచినీటి చెరువు గట్టునున్న సిమెంట్ రోడ్డు పక్కనే మూడు చేపల చెరువులకు గత ఐదు రోజులుగా అంతేకాకుండా కొప్పల్లి నుంచి ముచ్చలగుంట వెళ్లే మార్గంలో శ్మశాన వాటికి పక్కనే ఉన్న రొయ్యల చెరువులకు ఈ నీటిని యథేచ్ఛగా తోడేస్తున్నారు. ఇదంతా చూస్తున్న పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ, నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ సంబంధిత అధికారులు నిమ్మకు నిరుత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ స్థాయి సిబ్బంది నుంచి మండల స్థాయి అధికారుల వరకు వందలాది ఎకరాల్లో ఈ నీటిని తోడుకునేందుకు బడా బాబుల వద్ద నుంచి లక్షల రూపాయలు చేతులు మారినట్లు తెలుస్తోంది. అందువలన వారం రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతున్న వీటిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అమ్యమ్యాలే కారణమని ఆయా గ్రామాల్లోని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా కెనాల్, ఛానల్ ద్వారా బడా బాబులు చేపలు, రొయ్యల చెరువులకు నీటి తోడుతున్న విషయాలపై నీటిపారుదల శాఖ ఏఈ సాధిక్ ను వివరణ కోరగా ఈ ఛానల్ తమ పరిధిలో లేదన్నారు. కెనాల్ క్లస్టర్ నాగభూషణంను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల తోనే నీటిని తోడుతున్నారని వివరణ ఇచ్చారు. బుధవారం సాయంత్రం వరకు మాత్రమే గడువు ఉందని అక్కడి నుంచి మోటర్లు, ఇంజన్లు నిలిపివేస్తామని చెప్పారు. అంతేకాకుండా చెన్నూరు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్ ను వివరణ కోరగా తమ పరిధిలోని ఉన్న గ్రామాల్లో ఎక్కడ కూడా మంచినీటిని రొయ్యలు, చేపలు చెరువులకు తరలించడం లేదని బదులిచ్చారు.



పానకం పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలో వేంచేసి ఉన్న శ్రీ లంకమ్మ అమ్మవారి వార్షిక జాతరను పురస్కరించుకొని అవనిగడ్డలోని చైల్డ్‌హుడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆలయం వద్ద యాత్రికులకు పానకం పంపిణీ చేశారు మంగళవారం ఉదయం నిర్వహించిన కార్యక్రమాన్ని డిఎస్పి పి.మురళీధర్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావు, కార్యదర్శి దివి లీలాకృష్ణ, సభ్యులు అన్నపురెడ్డి కృష్ణ, అలపర్తి గోపాలకృష్ణమూర్తి, ఎస్సై జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని బంధలాయి చెరువు గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గాల వారు జనసేన పార్టీలో చేరారు. మంగళవారం అవనిగడ్డ జనసేన పార్టీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి వారు కలిశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, కునపరెడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని పార్టీలను నిలదీయండి: విమలక్క

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: ప్రజా సమస్యలు పట్టని పార్టీలను ఓట్లు అడిగేందుకు వచ్చినప్పుడు నిలదీయాలని అరుణోదయ సాంస్కృతిక సమైక్య ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క అన్నారు. నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు ఏప్రిల్ 14 నుండి మే 5 వరకు 20 రోజులు పాటు సాగుతున్న జన చైతన్య యాత్ర మంగళవారం మచిలీపట్నం చేరుకుంది. ఈ సందర్భంగా కోనేరు సెంటర్లో జరిగిన

కార్యక్రమంలో విమలక్క మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను విభజిస్తూ ఆనాటి కేంద్ర ప్రభుత్వం శ్రీకష్ణ కమిటీ నివేదిక ఆధారంగా అనేక హామీలు ఇచ్చిందని, తదుపరి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం హామీలేమీ అమలు చేయలేదన్నారు. ఫలితంగా పారిశ్రామిక అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ప్రజలకు ఉపాధి ఉద్యోగాలు కరువైపోయాయన్నారు. మచిలీపట్నం, దివిసీమ తదితర ప్రాంతాల భూములకు సాగునీరు అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని అన్నారు. సమస్యలపై పార్టీలను నిలదీయడంతో పాటు ఎన్నికల అనంతరం ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుణాకుల వీరాంజనేయులు, నాగేంద్రరావు దుర్గారావు, ఎఐఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఖరీం బాషా, బి.రమేష్, అంజిబాబు, మల్సూర్, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శైలజాకుమారి నియామకంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గ ప్రొసీడింగ్ అధికారిగా ఇటీవల అవనిగడ్డ నుండి బదిలీ అయి వెళ్లిన ఈవోపీఆర్డి పిశైలజకుమారిని నియమించడం పట్ల టిడిపి, జనసేన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మంగళవారం అవనిగడ్డలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద ఎన్నికల రిటర్నింగ్ అధికారిని కలిసి అర్జీ సమర్పించారు. మార్చి 26వ తేదీ నుండి వచ్చిన ఎన్నికల కోడ్‌ను అవనిగడ్డ ఈవోపీఆర్డిగా పని చేస్తున్న శైలజకుమారి ఉల్లంఘించి వైసిపికి అనుకూలంగా పని చేయడంతో అవనిగడ్డ నుండి వేరొక నియోజకవర్గానికి బదిలీ చేశారన్నారు మరలా ఆమెను నియోజకవర్గానికి ప్రొసీడింగ్ అధికారిగా ఈ నెల 13వ తేదీన నియమించారని తెలిపారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు గుడివాక శేషుబాబు, టిడిపి నాయకులు బండే రాఘవ, చందన రంగారావు, లంకేశ్వరరావు పాల్గొన్నారు.

నామినేషన్ వేసేందుకు వెళ్తున్న వెనిగండ్ల

కోలాహలంగా వెనిగండ్ల నామినేషన్

ప్రజాశక్తి-గుడివాడ : జనసేన, బిజెపి కూటమి బలపర్చిన టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము నామినేషన్ అట్టహాసంగా జరిగింది. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని వెనిగండ్ల స్వగృహము వద్ద వెనిగండ్ల రాము తన నామినేషన్ ర్యాలీని ప్రారంభించారు. అభిమానులు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఎంపి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ, అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ), బిజెపి జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలిసి ఖాకీ వస్త్రాలు ధరించిన వెనిగండ్ల రాము ర్యాలీలో పాల్గొన్నారు. తొలుత ఆయన స్వగృహం వద్ద సర్వమత ప్రార్థనలు చేసారు. అనంతరం ఇంటి వద్ద నుండి బయలుదేరిన ర్యాలీ బైపాస్‌రోడ్డు, ఏలూరురోడ్డు, నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, మెయిన్‌రోడ్, వాసవీచౌక్, బస్టాండ్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారిణి పద్మావతికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ నియోజకవర్గం సంబంధించి బహుజన సమాజవాద పార్టీకి చెందిన గుంటూరు నాగేశ్వరరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాకు చెందిన ముంగర వెంకట నాంచారయ్య నామినేషన్లు అందజేశారు.

నవభారత్ హైస్కూల్లో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-గన్నవరం: గత మూడు సంవత్సరాల నుండి నవభారత్ హైస్కూల్ విద్యార్థులు పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణులైనట్టు పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్ తెలియజేశారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ సంవత్సరం పాఠశాల టాపర్స్‌గా జి.అక్షయ 556 మార్కులు, బి.ప్రమతి 554 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.



దుర్గాప్రసాద్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: ఈ నెల 21న ఆంధ్ర యూనివర్సిటీ వేదికగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన పలు ఇంజనీరింగ్ కళాశాలలకు సంబంధించి నైపుణ్యం గల అధ్యాపకులను ఎంపిక చేసి భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్సు అవార్డుతో సత్కరించటం జరిగింది. దీనికి కృష్ణా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి ప్రధాన సమన్వయకర్త ఆచార్య బుద్ధా చంద్రశేఖర్, ఆంధ్రా యూనివర్సిటీ ఉపకులపతి ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా దుర్గాప్రసాద్ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ను కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి, రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్‌బాబు అభినందించారు.

విద్యార్థినులకు అభినందన

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో తుమ్మల అఖిల 588 మార్కులు, ఎస్ అఖిల 573 మార్కులు, పాలపర్తి రోహిణి 562 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుధీర్ టింబర్ డిపో అధినేత, లయన్స్ క్లబ్ జిల్లా ట్రెజరర్ నూకల సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, ఎంఈవో సుధారాణి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ సభ్యులు నల్లా శ్రీనివాసరావు, రాంబాబు, స్కూల్ అసిస్టెంట్ మునగాల వెంకటరమణ పాల్గొన్నారు.

సత్తా చాటిన బిసి హాస్టల్ విద్యార్థులు

ప్రజాశక్తి-అవనిగడ్డ: పదో తరగతి ఫలితాల్లో జిల్లా అవనిగడ్డ డివిజన్‌కు చెందిన బీసీ హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి తమ సత్తా చాటినట్లు వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిని ఎ.దివ్య తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ హాస్టల్స్ నుండి 116 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 95 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు వారిలో 500 పైగా మార్కులు సాధించిన వారు 12 మంది ఉన్నారని తెలిపారు. అఖిల్ కోడూరు వసతి గృహంలో విద్యనభ్యశిస్తూ 584 మార్కులు సాధించి బీసీ వసతి గృహాల్లో ప్రథమ స్థానం పొందాడని తెలిపారు. ఈ సందర్భంగా వెనుకబడిన తరగతుల అధికారి జి.రమేష్ విద్యార్థులను అభినందించారు.

బాలాజీకి అభినందన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: పదో తరగతి ఫలితాల్లో మండలంలో ప్రథమ స్థానం సాధించిన పి.మను బాలాజీకి ఎంఈఓ- 1 జగన్మోహనరావు అభినందనలు తెలిపారు. మండలంలోని కవుతరం కానూరి దామోదరయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి అభ్యసించి పబ్లిక్ పరీక్షల్లో 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం పొందిన బాలాజీని హైస్కూల్ ఆవరణలో మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
బుధవారం
24 ఏప్రిల్ 2024

తీర్పు-2024

పేటలో హ్యాట్రిక్ ఘనులు

మంత్రి, ప్రభుత్వ విప్ పదవులను అలంకరించిన నెట్టెం, సామినేని

భార్యాభర్తలకు అవకాశం ఇచ్చిన జగ్గయ్యపేట

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

తెలంగాణా సరిహద్దు ప్రాంతంలో ఉన్న జగ్గయ్యపేట నియోజకవర్గం 1952లో ఏర్పడింది. ఈ నియోజకవర్గంలో జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలు, జగ్గయ్యపేట పట్టణం, నందిగామ మండలంలోని 10 ఏటిపట్టు గ్రామాలతో కలుపుకొని మొత్తం 74 గ్రామాలు ఉన్నాయి. 2024 ఎన్నికలకు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,04,595 మంది ఓటర్లు ఉండగా, వీరిలో పురుషులు 98,121 మంది, మహిళా ఓటర్లు 1,06,462 మంది, ట్రాన్స్‌జెండర్లు 12 మంది ఉన్నారు. మొత్తం 15 సార్లు ఎన్నికలు జరగ్గా, కాంగ్రెస్, టిడిపి ఆరు సార్ల చొప్పున, సిపిఐ, వైసిపి, స్వతంత్ర అభ్యర్థులు ఒక్కోసారి గెలుపొందారు. తొలిసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి చెందిన పిల్లలమర్రి వెంకటేశ్వర్లు విజయం సాధించారు. ఇప్పటివరకు టిడిపి తరపున నెట్టెం రఘురాం వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయాలు సాధించారు. ఆయన 1985, 1989, 1994 ఎన్నికల్లో గెలుపొందారు. ఆయన ఒక్కరే ఈ నియోజకవర్గం నుండి పనిచేసే అవకాశం దక్కించుకున్నారు. ప్రస్తుత సిట్టింగ్ శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఇప్పటికి మూడుసార్లు గెలుపొందారు. 1999, 2004, 2019 ఎన్నికల్లో గెలుపొందారు. రెండు పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మొట్ట మొదటిసారిగా 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున సామినేని ఉదయభాను సమీప ప్రత్యర్థి, టిడిపి అభ్యర్థి నెట్టెం రఘురాంపై 7,471 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత 2004లో రెండో పర్యాయం కాంగ్రెస్ తరపున పోటీచేసిన ఆయన...టిడిపి అభ్యర్థి నెట్టెం రఘురాంపై 11,694 ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. ఆ కాలంలో ఆయన ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్...కాంగ్రెస్ అభ్యర్థి సామినేని ఉదయభానుపై 9,678 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2014 ఎన్నికల్లో కూడా టిడిపి అభ్యర్థి శ్రీరామ్ రాజగోపాల్...తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి సామినేని ఉదయభానుపై 1846 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆ తర్వాత 2019లో వైసిపి అభ్యర్థిగా రంగంలోకి దిగిన సామినేని ఉదయభాను తన సమీప ప్రత్యర్థి, టిడిపి అభ్యర్థి శ్రీరాం రాజగోపాల్‌పై 4,778 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈకాలంలో ఆయన ప్రభుత్వ విప్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు.

ఎంఎల్ఎలుగా భార్యాభర్తలు విఆర్‌జికెఎం.ప్రసాద్, వాసిరెడ్డి రాజ లక్ష్మమ్మ

జగ్గయ్యపేట శాసనసభ్యులుగా భార్యాభర్తలు విఆర్‌జికెఎం.ప్రసాద్, వాసిరెడ్డి రాజ లక్ష్మమ్మ ఎన్నికకావడం ఇక్కడ ప్రత్యేకత. 1972 ఎన్నికల్లో ముక్త్యాల రాజా వాసిరెడ్డి రామగోపాలకష్ణ మహేశ్వర ప్రసాద్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి రేపాల బుచ్చి రామయ్య శ్రేష్టిపై 13,261 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. అయితే ప్రసాద్ 1972లో ఆకస్మికంగా మరణించడంతో 1974లో ఉప ఎన్నికల జరిగింది. ఈ ఉప ఎన్నికల్లో ముక్త్యాల రాజా విఆర్‌జికె ఎం ప్రసాద్ భార్య వాసిరెడ్డి రాజ్య లక్ష్మమ్మ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి గెలుపొందారు. ఆమె 1978 వరకు ఎంఎల్‌ఎగా ఉన్నారు. ఇలా జగ్గయ్యపేట శాసనసభ్యులుగా భార్యాభర్తలు ఎన్నికైన ఘనతను ముక్త్యాల రాజా విఆర్‌జికెఎం ప్రసాద్, వాసిరెడ్డి రాజ్య లక్ష్మమ్మ దక్కించుకున్నారు.

జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు వీరే

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజారిటీ
1952	పి.వెంకటేశ్వర్లు	సిపిఐ	బి.తిరుపతయ్య	కాంగ్రెస్	21,20
1962 (ఎస్‌టి)	జి.వెంకటేశ్వర్లు	కాంగ్రెస్	పి.కోటేశ్వరరావు	సిపిఐ	1,092
1967	రేబాల బుచ్చిరామయ్య శ్రేష్ఠి	కాంగ్రెస్	టి.రాధాకృష్ణమూర్తి	ఇండి	13,074
1972	విఆర్‌జికెఎం.ప్రసాద్	ఇండి	బుచ్చి రామయ్య శ్రేష్ఠి	కాంగ్రెస్	13,261
1974	వాసిరెడ్డి రాజ్య లక్ష్మమ్మ	కాంగ్రెస్	కె..కృష్ణమోహనరావు	బిజెపి	---
1978	బొద్దులూరు రామారావు	కాంగ్రెస్	కె.కృష్ణమోహనరావు	జనతా	7,711
1983	అక్కినేని లోకేశ్వరరావు	టిడిపి	బి.రామారావు	కాంగ్రెస్	3,509
1985	నెట్టెం రఘురాం	టిడిపి	ఎం.వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	6,229
1989	నెట్టెం రఘురాం	టిడిపి	వసంత నాగేశ్వరరావు	కాంగ్రెస్	1,688
1994	నెట్టెం రఘురాం	టిడిపి	ఎం.వెంకటేశ్వరరావు	కాంగ్రెస్	19,055
1999	సామినేని ఉదయభాను	కాంగ్రెస్	నెట్టెం రఘురాం	టిడిపి	7,471
2004	సామినేని ఉదయభాను	కాంగ్రెస్	నెట్టెం రఘురాం	టిడిపి	11,694
2009	ఆర్‌జి శ్రీరాం	టిడిపి	సామినేని ఉదయభాను	కాంగ్రెస్	9,770
2014	ఆర్‌జి శ్రీరాం	టిడిపి	సామినేని ఉదయభాను	వైసిపి	1,846
2019	సామినేని ఉదయభాను	వైసిపి	ఆర్‌జి శ్రీరాం	టిడిపి	4,778

ప్రసాద్


వెంకటేశ్వర్లు

రఘురాం


ఉదయభాను

శ్రీరాం తాతయ్య

కవి గళం

ప్రజా'స్వామ్యం' - 'మజా'స్వామ్యం

విందామయా గురుడ విందామయా
జనుల ఆశలు కాస్త విందామయా
ప్రజల శోషలు కొంత కందామయా

అయిదేళ్లకొకమారు - ఎన్నికల పరీక్షలు
ప్రజలందరూ కలిసి పెడతారయా
ఆవురావురుమంటు
ప్రజల సేవకుల మంటు
నాయకులు పరుగులు పెడతారయా

విందాయమా గురుడ విందామయా
ఘనుల బాసలు కొన్ని విందామయా
ధనుల శ్లేషలు కొంత కందామయా

ఎన్నికల వేళలో - గెలుపు గుర్రాలంటు
ఎన్ని'కళలో' మనకు చూపేరయా
ఓటి మాటల తోటి - నోట్ల మూటల తోటి
ఓట్ల వేటలు వాళ్లు చేస్తారయా

చుద్దామయా గురుడ చుద్దామయా
నేతలూ గంతులు కందామయా
మాయా మాటలా చిందులు విందామయా

పూటకో మాటగా - అవినీతి చాటుగా
నడచు నాయకుల శాస్తి చేద్దామయా
దేశభోక్తలను తరిమికొడదామయా
నీతిగల నేతలను - సంస్కారవంతులను
ఎంచి మంచిని గెలిపించుకుందామయా
విలువున్న వ్యక్తులను - విజ్ఞానవంతులను
పిలిచి ప్రేమగ గద్దె యిద్దామయా
దేశ భక్తులకు గౌరవ యిద్దామయా
మనదేశాన్ని బహుబాగు చేద్దామయా
మనదేశాన్ని బహుబాగు చేద్దామయా

- గొల్ల నారాయణరావు

కోలాహలంగా కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్

ఇండియా వేదిక బలపరిచిన గన్నవరం నియోజక వర్గ సిపిఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు నామినేషన్ కార్యక్రమం మంగళవారం కోలాహలంగా జరిగింది. తొలుత గన్నవరంలోని చింతపల్లి పాపారావు భవన్ (సిపిఎం కార్యాలయం) వద్ద జరిగిన సభలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. అనంతరం అక్కడ నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ బొమ్మ సెంటర్, శాంతి థియేటర్ సెంటర్, బస్టాండ్ సెంటర్ వరకు సాగింది. అక్కడ నుంచి అప్సర సెంటర్ మీదుగా ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్‌కు చేరింది. డప్పు కళాకారులు తమ విన్యాసాలతో సందడి చేశారు.

ప్రజా నాట్యమండలి కళాకారుల ప్రదర్శన, సభకు హాజరైన ప్రజలు

గన్నవరంలో సాగిన ర్యాలీలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ నేతలు

వెంకటేశ్వరరావు (సిపిఎం)

నరసింహారావు (సిపిఎం)

జి.కృష్ణ (కాంగ్రెస్)

సంజీవరెడ్డి (కాంగ్రెస్)

తాతయ్య (సిపిఐ)

లక్ష్మణస్వామి (సిపిఎం)

కృష్ణాలో 28 నామినేషన్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో నామినేషన్ల స్వీకరణ ఐదో రోజు మంగళవారం 28 నామినేషన్లు దాఖలయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు స్థానానికి వల్లభనేని అనుదీప్ జనసేన పార్టీ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్లు, ఆదోతు తులసీరామ్ తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరపున రెండు సెట్లు, సింహాద్రి రామ్ చరణ్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, అంబళ్ల రాజ్‌కుమార్ జై భారత్ నేషనల్ పార్టీ తరపున ఒక సెట్ నామినేషన్, వల్లభనేని నాగ పవన్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గన్నవరం అసెంబ్లీ స్థానానికి కళ్లం వెంకటేశ్వరరావు సిపిఎం తరపున ఒక సెట్ , షేక్ చాన్ బాషా స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ , సింహాద్రి రాఘవేంద్రరావు బహుజన సమాజ్ పార్టీ తరపున ఒక సెట్, అజయ్ పైల నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున రెండు సెట్లు, తెల్లాకుల వెంకట లక్ష్మణస్వామి సిపిఎం తరపున ఒక సెట్, అరుణకుమారి పత్తిపాటి స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. గుడివాడ అసెంబ్లీ స్థానానికి రాము వెనిగండ్ల టిడిపి తరపున ఒక సెట్, పెడన అసెంబ్లీ స్థానానికి రేవతి దేవి సబ్బిశెట్టి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ఒక సెట్, మచిలీపట్నం అసెంబ్లీ స్థానానికి పేర్ని వాకా సాయి కృష్ణమూర్తి వైసిపి తరపున మూడు సెట్లు, ఈడే భాస్కరరావు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, ఆదోతు తులసీరామ్ తెలుగు రాజాధికార సమితి పార్టీ తరపున రెండు సెట్లు, సునీల్ బాబు కోటప్రోలు స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, అవనిగడ్డ అసెంబ్లీ స్థానానికి ముంగర వెంకట నాంచారయ్య పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ఒక సెట్, నాగేశ్వరరావు గుంటూరు బహుజన సమాజ్ పార్టీ తరపున ఒక సెట్, గిరిధర్ నాయుడు నాదెళ్ల స్వతంత్ర అభ్యర్థిగా ఒక సెట్, పామర్రు అసెంబ్లీ స్థానానికి మంగం రాజమనోహర్ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున ఒక సెట్, పెనమలూరు అసెంబ్లీ స్థానానికి శశిధర్ మరీదు తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరపున ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు.

భళే చిత్రాలు

ప్రచార 'భాగస్వామి'

'ప్రతి మగవాడి విజయం వెనుక ఓ మహిళ ఉంటుంది' అంటారు. ఈ నానుడిని నిజం చేస్తూ ఎన్నికల సమరాంగణంలో మేము సైతం అంటూ అతివలు భాగస్వాములవుతున్నారు. ఇంటింటి ప్రచారంలో ముందుంటున్నారు. తోటి మహిళలతో కలిసి బొట్టు పెట్టి మరీ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. భర్త విజయం కోసం అలుపెరగకుండా నిత్యం ప్రచారంలో పాల్గొంటున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి అభ్యర్థి సామినేని ఉదయభాను విజయాన్ని కాంక్షిస్తూ ఆయన సతీమణి విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను మంగళవారం జగ్గయ్యపేట పట్టణంలోని మిట్టగూడెం, క్రిస్టియన్‌పేటలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఉదయభాను సోదరి బేబీ, కుమార్తె పద్మ ప్రియాంక కూడా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

విద్వేష ప్రసంగాలు సరికాదు

సిపిఎం 'సెంట్రల్' అభ్యర్థి సిహెచ్.బాబూరావు

30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-విజయవాడ: మత చిచ్చు రేపుతూ, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ మోడీ విద్వేష ప్రసంగాలు చేయడం సరికాదని ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి చిగురుపాటి బాబూరావు అన్నారు. మంగళవారం సెంట్రల్ నియోజకవర్గంలోని 30వ డివిజన్ దేవీనగర్, రామకృష్ణాపురం ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ దేశం కోసం, సమైక్యత కోసం వామపక్షాలు, ఇండియా వేదిక పార్టీలు కేంద్రంలోని బిజెపి దుర్మార్గాలను ఎదుర్కొంటాయని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు అందరితో కలిసి పని చేస్తాయని అన్నారు. ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించడానికి హిందువుల ఆస్తులను ముస్లిములకు కట్టబెడతారంటూ మోడీ బహిరంగంగా దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. భారతీయులైన ముస్లింలను చొరబాటుదారులుగా ముద్ర వేసి విద్వేషాలను రగుల్చుతున్నారని విమర్శించారు. కంచే చేను మేసినట్లుగా రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రధాని మత చిచ్చు పెడుతూ విద్వేషాలను రగుల్చుతూ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసి కార్పొరేట్ల పరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సంపద మొత్తాన్ని కొద్దిమంది కార్పొరేట్ల చేతిలో పోగవుతుందని, సాధారణ ప్రజల ఆస్తులన్నీ కరిగిపోతున్నాయని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ మోడీ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నా రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష నేతలైన జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు స్పందించకపోవడం గర్హనీయమన్నారు. రాజ్యాంగం, లౌకికతత్వం పట్ల చిత్తశుద్ధి ఉంటే మోడీ విద్వేష ప్రసంగాలను జగన్, బాబు వెంటనే ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు కెవి భాస్కరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్ శ్రీనివాస్, కోటా కళ్యాణ్, నాయకులు వెంకటేశ్వరరావు (కొండా), షకీలా, ఆశ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యనగర్‌లో కరప్రతాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-అజిత్ సింగ్‌నగర్: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి బాబురావును గెలిపించాలని కోరుతూ సుందరయ్య నగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.శ్రీదేవి మాట్లాడుతూ విజయవాడ అభివృద్ధి చెందాలంటే సిపిఎం అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సిపిఎం నాయకులు పి.సాంబిరెడ్డి, మున్నా తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ప్రచారాల హోరు

సామినేని కుటుంబం ప్రచారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముందుకు వెళ్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పారదర్శక పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధం కావాలని విమలభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలభాను అన్నారు. పట్టణంలోని మిట్టగూడెం, క్రిస్టియన్ పేటలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందించిన సంక్షేమాన్ని, శాసనసభ్యులు సామినేని ఉదయభాను చేసిన అభివృద్ధిని తెలియపరుస్తూ ఉదయభాను సతీమణి సామినేని విమలభాను, ఆయన సోదరి బేబీ, కుమార్తె పద్మ ప్రియాంక ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

సర్నాల సోదరుడు స్వామి ప్రచారం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయాన్ని ఆకాంక్షిస్తూ వారి సోదరుడు సర్నాల స్వామి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సోదరుడు సర్నాల తిరుపతిరావును, ఎంపీ అభ్యర్థి కేసినేని నాని ని గెలిపించవలసిందిగా గడపగడపకు తిరుగుతూ ప్రజలను కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. జగన్ రావాలి – సామాన్యుడు గెలవాలి సామాన్యుడిని ఎమ్మెల్యేగా పంపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు అని ఆయన అన్నారు.

స్వామిదాసు ప్రచారం

ప్రజాశక్తి విస్సన్నపేట : విస్సన్నపేట మండలం స్థానిక విసన్నపేటలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకు సంక్షేమ పథకాలు వివరిస్తూ మద్దతు తెలపాలని కోరుతూ ఓట్లను నల్లగట్ల స్వామిదాసు ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసి డైరెక్టర్ మైదిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి జెడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి ఎంపిపి పిల్లి మెరిసి వనజాక్షి గ్రామ సర్పంచ్ నామల్లేశ్వరి పట్టణ అధ్యక్షులు నెక్కలకు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులు ఆవిష్కరించిన సామినేని

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: 'నా ఓటు సామినేని ఉదయభానుకే' అనే ప్లకార్డులను రాష్ట్ర ప్రభుత్వ విప్, సామినేని ఉదయ భాను మంగళవారం ఆవిష్కరించారు. మంగళవారం విద్యార్థి విభాగం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామిశెట్టి గోపి (మిల్లు గోపి) ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేలా చైతన్యం తీసుకురావాలని ఈ సందర్భంగా ఉదయభాను విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఓర్సు అరవింద్, మహమ్మద్ సోహెయిల్, షేక్ తాజుద్దీన్, మహేశ్ (చింటు), లడ్డు, ఆదిత్య, సీతారాం, సోను, శివ, అవినాశ్, ప్రసాద్, అఖిల్, కల్యాణ్, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో ప్లకార్డులతో ప్రచారం చేస్తున్న యువకులు

అన్నపూర్ణమ్మ, పి.కష్ణకుమారి, గుణమాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

3వ డివిజన్లో గద్దె అనురాధ ప్రచారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అభివృద్ధి, సంక్షేమం గురించి అస్సలు పట్టించుకోని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపి, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ సంక్షేమాన్ని అందించే చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోడానికి ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ అన్నారు. మంగళవారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 3వ డివిజన్ పరిధిలోని కాపుల బజార్ ఏరియాలో కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ గద్దె అనురాధ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, బండి కోమలి, పూలదాసు మారుతీ మోహన్, శ్రీను నాయుడు, గద్దె రమేష్, యలమంచిలి రాజేంద్ర ప్రసాద్, ఈశ్వర్ పేరెపి,

46వ డివిజన్‌లో సిపిఐ అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన బిజెపి, వైసిపిలకు ప్రజలు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ఇండియా కూటమి బలపరిచిన విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సిపిఐ అభ్యర్థి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఇవాళ మన రాష్ట్ర రాజధాన ఏదీ అని అంటే చెప్పుకోలని దుస్థితికి తీసుకువచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జి.కోటేశ్వరరావు మంగళవారం 46వ డివిజనులోని ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు.

వైసిపి పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్

ప్రజాశక్తి - వన్ టౌన్ : విద్యాధరపురంలోని 38వ డివిజనులో కార్పొరేటర్ రెహమతునిసా సారథ్యంలో వైసిపి పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన, సుపరి పాలన సంస్కరణలు, అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటికీ మేలు కలిగిందని ప్రజలే చెబుతుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గగుడి చైర్మన్.కర్నాటి రాంబాబు, పాత శివాలయం చైర్మన్ బొమ్ము మధు, జిల్లావక్ఫ్.బోర్డు చైర్మన్. షేక్ గౌస్ మొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం నందిగామ మెయిన్ బజార్‌లో 1500 మందికి ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. కొన్ని సంవత్సరాలుగా ప్రతినెల వికలాంగులకు బియ్యం పంపిణీ చేస్తూ, ఏడు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం మూడు నెలల పాటు ఎండాకాలంలో ఉచిత కూలింగ్ వాటర్ ఇచ్చే దాత జగ్గయ్యపేట జ్యువలరీ సహకారంతో ప్రతిరోజు 20 నుంచి 30 క్యాన్లు కూలింగ్ వాటర్ బాటసారులకు వితరణ చేశారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటిగంట వరకు మజ్జిగ వితరణ కార్యక్రమం చేశారు. నిర్వాహకులు రామిరెడ్డి కోటి సూర్యం మాట్లాడుతూ దాతలు స్వచ్ఛందంగా వచ్చి అందరూ కార్యక్రమాన్ని సహకరించాలని కోరారు. దాతలు సబ్ రిజిస్టర్ ఆఫీసు, శ్రీనివాస ఎలక్ట్రికల్స్ సహకారంతో మజ్జిగ చేశారు. దేవత విశ్వేశ్వరరావు దేవత వరుణ్ తదితరులు పాల్గొన్నారు. నందిగామ-మధిర రోడ్డులో గల తాళ్లూరి ఫిల్లింగ్ స్టేషన్ మండుటెండల్లో వచ్చే వాహనదారులకు, పాదచారులకు సేద తీరుస్తూ గత పది రోజుల నుంచి శీతల పానీయాలు నిమ్మరసం, రస్నా, మజ్జిగ ఇస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. మంగళవారం రోడ్డు వెంబడి వెళ్లే బాటసారులకు కూడా శీతల పానీయం ఇచ్చి సేద తీర్చారు.

దేవస్థానం భూములు బహిరంగ వేలం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారికి చెందిన మండలంలోని వేదాద్రి, బండిపాలెం, రావిరాల గ్రామంలోని మొత్తం య.144.77 సెంట్లకు 2024–25 సంవత్సరానికి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు ఆధ్వర్యంలో, జగ్గయ్యపేట శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థాన కార్యనిర్వహణాధికారి సి.జయప్రకాష్ బాబు పర్యవేక్షణలో భూముల కౌలుకు సీల్డ్ టెండర్–కం–బహిరంగ వేలం నిర్వహించారు. య.132.87 సెంట్లకు హెచ్చుపాటలకు రూ.8,78,000/- ఆదాయం వచ్చింది. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరానికి రూ.1,58,500లకు హెచ్చు పాట ద్వారా ఆదాయం వచ్చింది. మిగిలిన య.11.90 సెంట్లకు బహిరంగ వేలంలో పాల్గొనేందుకు పాటదారులు ముందుకు రాని కారణంగా సదరు '3' బిట్లకు వేలం పాటలు వాయిదా వేస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి శిరవరపు హేమలత దేవి తెలిపారు.

సబ్ కోర్టు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : హైకోర్టు న్యాయమూర్తి ఎ.వి.శేష సాయి, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికలు మంగళవారం జగ్గయ్యపేట కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నిపాక సుందర్‌రావు ఆధ్వర్యంలో న్యాయవాదులు జగ్గయ్యపేట కోర్ట్ ప్రాంగణంలో సౌకర్యాలు, జగ్గయ్యపేట కోర్టుకు వివిధ వర్గాల కక్షిదారులు న్యాయం కోసం ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుత వేసవి ఎండ తీవ్రత దృష్ట్యా వారు సేదదీరెందుకు కోర్టు వద్ద రేకుల షెడ్ నిర్మాణం, కక్షిదారులు తరచుగా నందిగామ వెళ్లవలసిన పరిస్థితులు తలెత్తకుండా చూడాలని, సబ్‌కోర్టును మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ సెక్రటరీ దామల సంతోష్, ట్రెజరర్ మెట్టెల ఆంజనేయులు, వైస్ ప్రెసిడెంట్ యలమంచిలి రాజేంద్ర ప్రసాద్, హైకోర్టు న్యాయవాది గండికోట శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

11 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : అగ్రహారం గ్రామంలో నాలుగున్నరేళ్లుగా పనిచేస్తున్న 11 మంది వాలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు.

దుర్గగుడి ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, దుర్గగుడి ఆధ్వర్యంలో మంగళవారం గిరిప్రదక్షిణ వైభవోపేతంగా సాగింది. ఈ రోజు పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం కామధేను అమ్మవారి ఆలయం (ఘాట్ రోడ్ ఎంట్రన్స్ వద్ద) వద్ద శ్రీ స్వామి, అమ్మవార్లకు ఆలయ వైదిక సిబ్బందిచే ఉదయం 5.55 గంటల సమయంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ఆలయ ఇఇ కె.ఎస్ రామరావు గిరిప్రదక్షిణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్ కె.వి.ఎస్.కోటేశ్వర రావు, ఆలయ అధికారులు, సిబ్బంది, యాత్రికులు పాల్గొన్నారు. కామధేను అమ్మవారి ఆలయం, కుమ్మరిపాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సితార, కబేలా, పాల ఫ్యాక్టరీ, చిట్టి నగర్, కొత్తపేట, నెహ్రూ బొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి, ఘాట్ రోడ్ మీదుగా డప్పులు, బేతాల నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమం నడుమ తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

కొనసాగిన నామినేషన్లు

తిరువూరులో మాట్లాడుతున్న తాంతతియా కుమారి

పశ్చిమంలో ఐదు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - భవానీపురం : పశ్చిమ నియోజకవర్గం నుండి శాసనసభ్యత్వానికి మంగళవారం ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా పోతిన వెంకట రామారావు, ఇండియా యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ అభ్యర్థిగా షేక్ ఖాసావలి, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సాయిబాబు నక్కల, స్వతంత్ర అభ్యర్థులుగా మద్దిరాల భూషణ రాజు, మండల శ్రీనివాసరావు భవానిపురం లోని పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఈ కిరణ్మయికి తమ నామినేషన్లు దాఖలు చేశారు.

మైలవరంలో3 నామినేషన్లు

మైలవరం : మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం ముగ్గురు నామినేషన్లో అందజేసినట్లు మైలవరం రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. జై భారత్ నేషనల్ పార్టీ తరపున ఓర్సు రామారావు, స్వతంత్ర అభ్యర్థులుగా నూనె సుధీర్ కుమార్ రెడ్డి, చింతపల్లి దాసులు నామినేషన్ దాఖలు చేసినట్లు సంపత్ కుమార్ తెలిపారు.

జగ్గయ్యపేటలో 2 నామినేషన్లు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయంలో మంగళవారం జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా కొదమల ప్రభుదాసు, టిడిపి అభ్యర్థిగా శ్రీరామ్ శ్రీదేవి తరపున శ్రీ రామ్ రామకృష్ణ నామినేషన్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ 2 నామినేషన్లు కలిపి ఇప్పటివరకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో 17 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

బిసివై పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పసాని భూలక్ష్మి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : మైలవరం బిసివై పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ముప్పసాని భూలక్ష్మి పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం బిసివై తరపున బి ఫాం అందుకున్నారు. మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈనెల 24న నామినేషన్ వేస్తున్నారు. ముప్పసాని భూలక్ష్మి నియోజకవర్గానికి స్థానికంగా ఉన్న తనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ప్రజా సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

నామినేషన్ ర్యాలీని విజయవంతంచేయండి

ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు సామినేని ఉదయభాను

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట శాసనసభ వైసిపి అభ్యర్థిగా తాను నేడు నామినేషన్ వేయనున్నట్లు ఎంఎల్‌ఏ సామినేని ఉదయభాను

తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు తమ ఇంటి నుండి మునిసిపల్ ఆఫీస్ వరకు ప్రారంభమయ్యే ర్యాలీకి భారీగా తరలిరావాలాని కోరారు. ఈ నామినేషన్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు తాంతియా కుమారి నామినేషన్

ప్రజాశక్తి - తిరువూరు : ఇండియా వేదిక బలపరిచిన తిరువూరు నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బుధవారం ఉదయం 11 గంటలకు తన నామినేషన్ వేయనున్నట్లు లామ్ తాంతియా కుమారి తెలిపారు. మంగళవారం రాజీవ్ భవన్‌లో తిరువూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండ లాల పార్టీ నాయకులు, కార్యకర్తల కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన ఆమె నామినేషన్‌పై చర్చించారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకుల, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, యడ్లపల్లి రామకృష్ణ, తాళ్ల సురేష్, బొడ్డు ప్రకాష్ రావు, ఉప్పలపాటి లక్ష్మీ దాస్ పాల్గొన్నారు. తిరువూరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న వారిలో మంగళవారం బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి లక్కెపోగు వందనకుమార్, స్వామిదాసు (వైసీపీ) తరపున ఆయన భార్య సుధారాణి నామినేషన్ పత్రాలను ఆర్వోకు సమర్పించారు.

ప్రజల ఆర్థిక, విద్యాభివృద్ధి లక్ష్యం : అజయ్ కల్లాం

ప్రజాశక్తి - మైలవరం : ప్రజలను ఆర్థికంగా, విద్యా పరంగా, సామాజికంగా పైకి తీసుకురావడమే నిజమైన అభివృద్ధి అని మాజీ చీఫ్ సెక్రటరీ, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారుడు అజయ్ కల్లం అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ చలవాది మల్లికార్జునరావు కళ్యాణ మండపంలో పాలకుల భద్రత – పౌరుల బాధ్యత సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం సమగ్ర విశ్లేషణ కార్యక్రమానికి అజయ్ కల్లం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ఉద్యోగులు, చదువుకున్న వాళ్లు, రాజకీయ నాయకులు రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని అంటున్నారని, వారికి అభివృద్ధికి నిర్వచనం తెలుసా అని ప్రశ్నించారు. బడులను తీర్చిదిద్ది, పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించడం, భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం అభివృద్ధి కాదా అన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసి ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయడం అభివృద్ధి కదా అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, పూర్వ మీడియా అకాడమీ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, మేడపాటి వెంకట్, ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావులు ప్రసంగించారు.

పోలీసుల కవాతు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని వెస్ట్ ఏసీపీ మురళి కృష్ణ రెడ్డి తెలిపారు. సంఘ విద్రోహ శక్తుల నిర్మూలించే దిశగా పోలీస్ వారి సంసిద్ధతను తెలియజేస్తూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డీజీపీ, విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డిసిపి వెస్ట్, వెస్ట్ ఏసిపి పర్యవేక్షణలో విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెస్ట్ ఏసీపీ మురళి కష్ణ రెడ్డి మాట్లాడుతూ విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాణా టాటా ఆదేశాల మేరకు వన్‌టౌన్ ఏరియా లిమిట్స్ లో ఎన్నికల నిర్వహణ దృష్ట్యా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ రైతు పేట శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం ఐదో తరగతి నుండి ఆరవ తరగతికి ప్రమోట్ అయిన విద్యార్థిని విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ ఆప్రాన్ ధరింప చేసి వారు ఆరో తరగతికి ప్రమోట్ అయినట్లుగా సర్టిఫికెట్ వారికి అందజేశారు. ప్రిన్సిపల్ గుత్తా ప్రదీప్ మాట్లాడుతూ ఇటు వంటి కార్యక్రమాలు విద్యార్థినీ విద్యార్థులకు భవిష్యత్తులో వారు నిర్దేశించుకోవలసిన లక్ష్యాలను గుర్తు చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ సాంస్కతిక ప్రదర్శనలు జరగటంతో వివిధ విభాగాల్లో బహుమతులు పొందిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మురళీకృష్ణ ఆర్ఐ వినోద్ పాల్గొని విద్యా ర్థులను అభినందించారు. తల్లిదండ్రులు పాల్గొన్నారు:

సి-2024 ప్రవేశ పరీక్షకు అనూహ్య స్పందన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సిద్దార్ధ డీమ్డ్ టు బి యూనివర్శిటీలో ఈవిద్యా సంవత్సరం 2024 నుండి ఇంజనీరింగ్ కోర్సలలో ప్రవేశాలకు సంబంధించి స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు సిద్దార్ధ అకాడమి సెక్రటరీ పాలడుగు లక్ష్మణరావు తెలిపారు. కానూరులోని సిద్దార్ధ డీమ్డ్ టు బి యూనివర్శిటీలో స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన వివరాలను తెలియచేసేందుకు మంగళవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలగపూడి రామకృష్ణ సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల ' సిద్దార్ధ అకాడమి ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ' డీమ్డ్ టు బి యూనివర్శిటీగా ఈవిద్యా సంవత్సరం నుండి ప్రారంభించినట్లు తెలిపారు. దీనికి సంబందించి ఈవిద్యా సంవత్సరం నుండి ' సీ – 2024 ' ప్రవేశ పరీక్ష (సిద్దర్ధ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) నిర్వహిస్తున్నామని తెలిపారు.

గుడిలో విరిగిపడిన సీలింగ్

ప్రజాశక్తి - మోపిదేవి: ప్రతిరోజు వేలాదిగా భక్తులు ఉండే దేవస్థానంలో మంగళవారం ప్రత్యేకత కాగా ఉదయం 8 గంటల సమయంలో అన్నదానం హాలు సీలింగ్ పడిపోయింది. యాత్రికులు హాలులో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని యాత్రికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత ఏడాది డిసెంబరులోనే దేవదాయ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రారంభించిన అన్నదానం హాలు నాలుగు నెలల వ్యవధిలోనే విరిగిపడటంపై యాత్రికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రంలో వేలాదిగా యాత్రికులు ఉండే అన్నదానం హాలులో సీలింగ్ విరుగిపడి

శుభ్రం చేస్తున్న హాలు

పెను ప్రమాదం తప్పినప్పటికీ గుట్టు చప్పుడు కాకుండా శిథిలాలను అధికారులు తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు.

కొడాలి నాని ప్రచారం

ప్రజాశక్తి - గుడ్లవల్లేరు : మండలంలోని చంద్రాల, సింగలూరు విన్నకోట గ్రామాల్లో గడపగడప ప్రచార కార్యక్రమాన్ని మంగళవారం ఎమ్మెల్యే కొడాలి నాని నిర్వహించారు. సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందాలన్నా, అభివృద్ధి ప్రతి ప్రాంతంలో జరగాలన్న జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే నాని అన్నారు. చంద్రబాబు, కూటమిని బంగాళాఖాతంలో కలపవల్సిన సమయం వచ్చిందని చెప్పారు. ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న రావాలి.. జగనన్న కావాలన్నారు. సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందాలంటే.. అభివద్ధి ప్రతి ప్రాంతంలో జరగాలంటే జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్నికల ప్రచారంలో గుడ్లవల్లేరు మండల వైసీపీ అధ్యక్షుడు శాయన

రవి, ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ పోలగాని రమాదేవి, సీనియర్ వైసీపీ నాయకులు పాలేటి చంటి, జిల్లా వ్యవసాయ కమిటీ సలహాదారు పెన్నేరు ప్రభాకర్ రావు, యువజన విభాగ అధ్యక్షుడు గుదేరవి, మహిళా విభాగ అధ్యక్షురాలు, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పడమట సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - చల్లపల్లి : మండల పరిధిలోని పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్‌లో మంగళవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాప్రోహకాలుగా పలువురు దాతలు విరాళాలు అందించారు. నాదెళ్ల నర్సయ్య తండ్రినారాయణరావు జ్ఞాపకార్థం పదివేలు, నాదెళ్ళ ప్రభాకరరావు ఐదువేలు, నాదెళ్ళ గోపీచంద్ ద్వారా నాదెళ్ళ వామనరావు పదివేలు, మాలెంపాటి జమంతమ్మ రిటైర్డ్ టీచరు రంగారావు ద్వారా పన్నెండువేలు రూపాయలను పదో తరగతిలో ప్రథమ,ద్వితీయ స్థానాలకు, సబ్జక్టుల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాలు వచ్చిన విద్యార్థులకు అందజేశారు. అకడమిక్ బహుమతులను కొడాలి మనోజ్ భద్ర, మహతి వివాహ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బి.ఎన్ శర్మ విద్యార్థులకు అందజేశారు. ఇంటర్మీ ప్రథమ,ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తెలుగులో కె.గుణశ్రీ మార్కులు 94, పి.పూజితలక్ష్మి 91 వచ్చిన విద్యార్థులకు ఓలేటి ఉమాసరస్వతి

వార్షికోత్సవ వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

చెరొక రెండువేలు ఇచ్చారు. బోటనీలో 45 మార్కులు వచ్చిన వారికి ప్రోత్సాహకంగా తలా వెయ్యి చొప్పున ఆరువేలు పి జి టి వై రాజమహేశ్వరి, ఫిజిక్స్‌లో 55, కెమిస్ట్రీలో 52 మార్కులు వచ్చిన కె.గుణశ్రీకి వెయ్యిరూపాయలు చొప్పున పిజిటిసిహెచ్ లక్ష్మిపిజిటి టి.మణిమాధవి ఇచ్చారు. జువాలజీలో మంచి మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి వెయ్యి చొప్పున సీనియర్ ఇంటరు ముగ్గురికి జూనియర్ ఇంటరు ఐదుగురికి పి జి టి నాగలక్ష్మి ఇవ్వడం జరిగింది.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సత్తా ప్రపంచానికి చాటాలి

ప్రజాశక్తి - ఘంటసాల : ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తూ తమ ప్రతిభను చాటుతున్న నిరుపేద విద్యార్థుల తమ సత్తాను ప్రపంచానికి తెలియ చేస్తున్నారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ఘంటసాల మండలంలో ప్రభుత్వ పాఠశాల విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన కేతన జోత్స్న, డి నాగ జ్యోతిర్మయి, చరణ్ తేజ్ లను ఘంటసాల గ్రామంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సురేష్ బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్కూల్లో విద్యార్థులకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించినప్పటికీ ప్రపంచానికి తమ ప్రతిభ తెలపటానికి అవకాశాలు చాలా తక్కువ ఉన్నాయన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రతిభ చూపే విద్యార్థులను ప్రోత్సహించేలా పాఠశాలల్లో టీచర్లు విద్యార్థులకు అభినందన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా పాఠశాలలో మిగతా విద్యార్థులకు వీళ్ళు స్ఫూర్తిదాయకంగా ఉంటారన్నారు. ప్రతిభకు పేదరికంతోపాటు ఏది అడ్డు కాదని జోత్స్న, జ్యోతిర్మయి, చరణ్ తేజ్ లు మరోసారి రుజువు చేశారని సురేష్ బాబు పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులు సాధిస్తున్న ప్రగతి, ప్రతిభకు ప్రచారం కల్పించి వారి ద్వారా మిగతా విద్యార్థులు పూర్తి పొందేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతి ఒక్కరు చొరవ చూపాలని సురేష్ బాబు కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు మెరుగు వేణుగోపాలరావు, చింతల శ్రీనివాసరావు, పి గోవర్ధనరావు తల్లిదండ్రులు, మెరుగు ప్రశాంతి పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - చల్లపల్లి : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన కె.భవజ్ఞ సాయిని టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూలు విద్యార్థిని భవజ్ఞ సాయి 597 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలవటంతోపాటు రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకును సాధించింది. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థిని భవజ్ఞ సాయిని, ప్రిన్సిపాల్ జి.మదుసూధనరావులను వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావులు దుశ్శాలువాలతో మంగళవారం సత్కరించారు.



విద్యార్థిని అభినందించిన దృశ్యం

కళ్లం నామినేషన్‌కు తరలిన నాయకులు

ప్రజాశక్తి - చల్లపల్లి : గన్నవరం నియోజక వర్గం సిపిఎం నియోజకవర్గ అభ్యర్థి కళ్ళం వెంకటేశ్వర రావు నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్లిన చల్లపల్లి మండల కార్యకర్తలు

నామినేషన్‌కు వెళ్తున్న నాయకులు

ప్రజాశక్తి చల్లపల్లి గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థి పి.కళ్ళం వెంకటేశ్వరరావు నామినేషన్ కార్యక్రమానికి మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు ఆధ్వర్యంలో తరలి వెళ్లిన కార్యకర్తలుమేడేపల్లి వెంకటేశ్వరరావు, సిద్దబత్తుల, నంద్యాల ప్రభు, రేవు నాగేశ్వరరావు, లంకపల్లి సత్యం, బళ్ళ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంకటావ పంచాయతీలో శంఖారావం

ప్రజాశక్తి - గూడూరు : పెడన నియోజకవర్గం టిడిపి, జనసేన, బీజేపీ,ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ సతీమణి కాగిత శిరీష మంగళవారం గూడూరు మండలం కంకటావ పంచాయతీ పరిధిలో కత్తులవాని పాలెం గ్రామంలో శంఖారావం సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. మొదటి ఓటు ఎంపీ అభ్యర్థి బాలశౌరికి గాజు గ్లాస్ గుర్తుపై, రెండో ఓటు ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కష్ణ ప్రసాద్‌కి సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి, ప్రధాన కార్యదర్శి సిరివెళ్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి - అవనిగడ్డ: ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవనిగడ్డ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో పుస్తక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింహాద్రి రామలింగేశ్వర రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక పఠన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ నాగ శంకర్ ఆనంద్ గ్రంథాలయ అధికారి జె.ప్రభుదాస్ డీఎస్సీ విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫేర్ వెల్ పార్టీ వేడుకలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గంద్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పేర్ వెల్ పార్టీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి యల్ చిట్టిబాబు హాజరయ్యారు. నవోదయ పాఠశాలలో సీటు పొందిన విద్యార్థి బోయిళ్ళ అవినయ్ కు మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంద్రాయి లో ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాల టాపర్ నిలిచిన విద్యార్థి పిల్లి కౌశిక్ (568)ను మండల విద్యాశాఖ అధికారి అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులు సాంస్కతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్ బాబు, జ్యోతి కుమారి, సి.ఆర్.పి.రామ్ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గద్దెకు బి.ఫారం ఇచ్చిన చంద్రబాబు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : విజయవాడ తూర్పు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గద్దె రామమోహన్, ఆపార్టీ అధినేత చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బి.ఫారం అందుకున్నారు. మంగళవారం విజయనగరం జిల్లా పర్యటనకు వెళ్లే సందర్భంలో చంద్రబాబునాయుడును కలిసిన గద్దె రామమోహన్ రావు బి. ఫారం అందుకున్నారు. ఈకార్యక్రమంలో గద్దె రామమోహన్ సన్నిహితులు పుట్టగుంట సతీష్ కుమార్ ఉన్నారు. రాష్ట్రంలోనే మంచి మెజారిటీతో గెలిచే అభ్యర్థులలో గద్దె రామమోహన్ ఉన్నారని, ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో గెలవాలని చంద్రబాబునాయుడు గద్దె రామమోహన్‌కు సూచించారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - చల్లపల్లి : చల్లపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, వైసీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పఠాన్ కరీముల్లా ఖాన్ తన పదవికీ... పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ప్రకటించారు. వైసీపీ స్థాపించిన నాటి నుంచీ పార్టీకి చిత్తశుద్ధితో పనిచేస్తున్న తన పట్ల పార్టీ నేతలు చులకన భావంతో వ్యవహరించటంతో పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి మద్దతు తెలిపారు. మైనార్టీ ఐక్యవేదిక, మచిలీపట్నం పార్లమెంట్ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలసౌరి, మండలి విజయానికి కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి అండర్ -17 చెస్ పోటీలలో ఎస్ఆర్ఆర్ కోచింగ్ అకాడమీ ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 20, 21 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -17 చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలలో నగరంలోని ఎస్.ఆర్.ఆర్. చెస్ కోచింగ్ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించారని అకాడమి డైరెక్టర్ పి.రేణుక తెలిపారు. నగరంలోని ఎస్ఆర్ఆర్ చెస్ అకాడమిలో పతకాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా డైరెక్టర్ రేణుక మాట్లాడుతూ అండర్ -7 విభాగంలో కె.సుప్రీత్ బంగారు పతకం, గోకుల్ నందన్ రెడ్డి రజత పతకం సాధించారని తెలిపారు. అలాగే మరో విద్యార్థి కె.సురార్చిత్ నాల్గవ స్థానం సాధించాడని తెలిపారు. అండర్ -9 విభాగంలో బి.శ్రీ వశిష్ట రజత పతకం, అండర్ -11 విభాగంలో ఏ.సుహాస్ రజత పతకం, జె.లాలస కాంస్య పతకం సాధించారని తెలిపారు. ఈసందర్భంగా అకాడమి చీఫ్ కోచ్ ఎం.ఎం.ఫణికుమార్‌ను, పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

అదనపు పనులు చేయించే వారిపై చర్యలు తీసుకోవాలి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి

విజయవాడ : నిబంధనలకు భిన్నంగా ఆశ వర్కర్లకు సంబంధం లేని పనులు చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ,ఏ.పీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఆశా వర్కర్ల జిల్లా విస్తృతస్థాయి సమావేశం, రాణిగారి తోట, సిఐటియు జిల్లా కార్యాలయంలో, పి.జ్యోతి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్స్‌కు సంబంధం లేని పనులు చేయించకూడదని, ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ, పిహెచ్‌సి, యుపిహెచ్‌సి స్థాయిలో ఆశా వర్కర్స్‌తో అదనపు పనులు చేయిస్తున్నారని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రూమ్ తాళం తీయడం శుభ్రం చేయడం, రిజిస్టర్లో సంతకాలు పెట్టి, మూమెంట్ రాసిన తర్వాత ఫీల్డ్ వర్క్ కు వెళ్లాలని, మరలా సెంటర్స్‌కి వచ్చి నాలుగు గంటల వరకు ఉండాలని, అలా చేయకపోతే జీతాలు ఆపుతామని, ఉద్యోగాల నుండి తొలగిస్తామని, అధికారులు బెదిరించటం సరైన పద్ధతి కాదన్నారు. రికార్డ్స్ కొనాల్సిందేనని, సొంత ఫోన్ నుండి పనిచేయాలని, ఏఎన్ఎం యాప్స్ ను ఆశా సెల్ ఫోన్ లో డౌన్లోడ్ చేసుకుని, పని చేయమని ఒత్తిడి చేయడం ఆపాలని, మొబైల్ వర్క్ శిక్షణ ఫిజికల్ గా ఇవ్వాలని, సెంటర్ క్లీనింగ్ చేయించడం ఆపాలని, ఆసుపత్రులను గర్భవతులు, బాలింతలను, తీసుకెళ్లినప్పుడు, ఆశా వర్కర్ ను కూడా, గర్భవతి వెంట ఉండేలా ఆసుపత్రి అధికారులు అవకాశం కల్పించాలని ఆమె కోరారు. పై సమస్యలన్నిటిపై, ఫిబ్రవరి 9వ తేదీన, యూనియన్ రాష్ట్ర కమిటీతో, అధికారులు జరిపిన చర్చల్లో చర్చించామని తెలిపారు. కమిషనర్ కార్యాలయం నుండి సర్క్యులర్ కూడా జారీ అయినా ఏ మార్పూ లేదన్నారు. ఈ సమస్యలపై మే 7న జరిగే ఆశా డే సందర్భంగా, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద, భోజన విరామ సమయంలో ఆశ వర్కర్లు నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రాలు అందజేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎ.కమల, జిల్లా కోశాధికారి పి. శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధనలక్ష్మి

ఆల్ఫా సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ సమీపంలో ఉన్న ఆల్ఫా సూపర్ మార్కెట్‌లో అగ్ని ప్రమాదం జరగ్గా పక్కన ఉన్న రెస్టారెంట్లో మంటలు వ్యాపించాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. మంటలు ఒకేసారి అలుము కున్నాయి. ఫైర్ ఇంజను వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటల వల్ల షాపింగ్ మాల్‌లో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. పిజా సెంటర్‌లో ఉన్న విద్యుత్ వైర్లు కాలిపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రాణనష్టం ఏమి జరుగలేదు. రూ.15 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

పుస్తకాలు పంపిణీ

విజయవాడ : బందరు రోడ్డులోని ఇండియన్ ఆయిల్, ఫైలెట్ సర్వీస్ స్టేషన్ ప్రాంగణంలో వినియోగదారుల పిల్లలకు ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఇండియన్ ఆయిల్ సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్ పాల్గొని ప్రపంచ పుస్తక దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా మనిషి మేదస్సు పెరుగుతుందని వీసా లేకుండా ప్రపంచాన్ని చుట్టి రావాలంటే అది కేవలం పుస్తకాలు చదవటం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫైలట్ సర్వీసెస్ స్టేషన్ అధిపతి ఎం.ఎ.వి.సత్యనారాయణ పాల్గొని, తమ వినియోగదారులకు వారి పిల్లలకు ఉపయోగపడే కార్యక్రమాలు మా బంకు ద్వారా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజర్ కె.వెంకటప్పయ్య, నంది కిషోర్ పాల్గొన్నారు. ఇండియన్ ఆయిల్ చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

పదిలో సత్తా చాటిన విద్యార్థులు

గుంటుపల్లి డాన్ బాస్కో విద్యా కుసుమాలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పదవ తరగతి ఫలితాల్లో గుంటుపల్లి డాన్ బాస్కో (స్టేట్) విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ ఇన్నా రెడ్డి పేర్కొన్నారు. పదిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. భవ్యమంజు శ్రీ 584 మార్కులతో పది ఫలితాల్లో మండల స్థాయి ర్యాంకర్ నిలిచారు. 500 పైగా మార్కులు సాధించిన 38 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. 96 శాతం ఉతీర్ణత సాధించిన పాఠశాలగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు 105 మంది విద్యార్థులు 100 మంది ఉతీర్ణత సాధించారని తెలిపారు. 584 మార్కులతో భవ్య మంజు శ్రీ పాఠశాలలో అధిక మార్కులు సాధించి మండల స్థాయి ర్యాంకర్‌గా నిలిచిందన్నారు. 38 మంది 500 మార్కులు పైగా సాధించారని పేర్కొన్నారు. 96 శాతం ఉతీర్ణత సాధించడం గర్వకారణంగా ఉందని తెలిపారు.

మండల స్థాయిలో నిలిచిన కొండపల్లి జడ్‌పి విద్యార్థినులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇబ్రహీంపట్నం మండల స్థాయిలో ప్రథమ స్థానం 577/600 సాధించిన కొండపల్లిలోని జెడ్ పిబాలికోన్నత పాఠశాల విద్యార్థినులు బండారు ఉషారాణి 577 మార్కులతో, ఎస్‌కె.షఫీనా 577 మార్కులతో 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన వీరు ఇబ్రహీంపట్నం మండలం ప్రథమ స్థానాలు సాధించి పాఠశాల కు మంచి పేరు సంపాదించి పెట్టారని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కొనియాడారు. ఈ సందర్భంగా నందిగామ ఉప విద్యాశాఖాధికారి ఏ.వెంకటప్పయ్య పిల్లలకు ఆశీస్సులు అందించారు. మరో విద్యార్థినీ జి.అలేఖ్య 558 మార్కులతో ద్వితీయ స్థానంలో, వై.మౌనిక 540 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారని హెచ్‌ఎమ్ బి.పద్మలత తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల స్థాయిలో మొదటి స్థానాన్ని, మండల స్థాయిలో ఎక్కువ మార్కులు సాధించిన ఘనత మండల స్థాయిలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 23 మంది ఉన్నారని, హిందీ, ఇంగ్లీష్ సబ్జెక్టులకు సంబంధించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు అన్ని సబ్జెక్టులలోనూ 90శాతం పైగా ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఎస్ఎమ్‌సి చైర్‌పర్సన్ ఎన్.పుష్ప విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.

టెన్త్ మండల్ టాపర్ నవీన్ రెడ్డి

ప్రజాశక్తి - గంపలగూడెం: 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి గంపలగూడెం మండలం పదో తరగతి పరీక్షలు ఫలితాలను విద్యా శాఖ నుండి వచ్చిన వివరాల ప్రకారం పరిశీలిస్తే,11 ప్రభుత్వ,9 ప్రైవేటు పాఠశాలుండగా, ప్రైవేటు పాఠశాలైన స్థానిక లిటిల్ ఏంజిల్స్ స్కూల్ విద్యార్థి వెన్నపూస నవీన్ రెడ్డి 584/600 మార్కులు సాధించి మండల టాపర్‌గా, నిలిచాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాల గంపలగూడెం పాఠశాల నుండి పి.నిఖిత 580/600మార్కులతో మండల టాపర్ అనే పదాన్ని దక్కించుకుంది. పాఠశాలల వారీగా, వివరాలు క్రింది విధంగా ఆయా ప్రధానోపాధ్యాయులు తెలిపారు. నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 30 మంది పరీక్షలకు హాజరు కాగా 28 మంది ఉత్తీర్ణులుకాగా, 93.33శాతంగా చెప్పారు. ఊటుకూరు పాఠశాల నుండి 72కి 58 ఉత్తీర్ణులు కాగా, 80.56శాతం, ఆర్లపాడు నుండి 31కి 28 ఉత్తీర్ణులు, 90శాతం, సత్యాల పాడు 29కి 28 ఉత్తీర్ణులు, 93శాతం, పెనుగొలను 66కి 62 ఉత్తీర్ణులు, 93.94శాతం, గంపలగూడెం 100కి 76 ఉత్తీర్ణులు, 76శాతం, కనమూరు 57కి 56, 98.25శాతం, తునికిపాడు 16కి14 87.5శాతం, కేజీబీవీ గర్ల్స్ పెదకొమెర 40కి 40, 100శాతం, మోడల్ స్కూల్ పెద్ద కొమెర 84కి 84 100శాతం, ఏబీఎన్ హెచ్ఎస్.అమ్మిరెడ్డిగూడెం 8కి 4 50శాతం, మొత్తంగా, 205కి 198 ఉత్తీర్ణులు, 96.59 శాతం.

ప్రైవేటు పాఠశాలల వివరాలు

సిద్ధార్థ హై స్కూల్, ఊటుకూరు 43కి 43 ఉత్తీర్ణులు, 100శాతం, కేరళ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఊటుకూరు 11కి 11,100శాతం, వివేకానంద విద్యాలయం హై స్కూల్ గొల్లపూడి 34కి 33, 97.06 శాతం, శ్యాం జ్యూస్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ తోటమూల 14కి 14, 100శాతం, శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ తోటమూల 6కి 6, 100 శాతం, లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ గంపలగూడెం 36కి 34,94.44శాతం విజ్ఞాన్ హై స్కూల్ గంపలగూడెం 4కి 4, 100శాతం, శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్, పెద్ద కొమెర 52కి 52 100శాతం, గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ తోటమూల 39కి 39 - 100 శాతం, మొత్తంగా, 239 కి 236 ఉత్తీర్ణులు 98.74 శాతం కాగా, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వెరసి 444కి 434మంది ఉత్తీర్ణులు కాగా, 97.75శాతంగా వివరించారు.

91.30 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - తిరువూరు : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏ.కొండూరు మండ లం, పోలిశెట్టిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 91.30 శాతం ఉత్తీర్ణత సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయులు ఏ.రవికుమార్ వెల్లడించారు. పాఠశాల స్థాయిలో అత్యధికంగా కాకర్ల సాహితీ 525, పట్టెం జాహ్నవి 506, కొమ్ము ఉమాంజలి 506 మార్కులు సాదించారన్నారు. ఈవిద్యార్థులను ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం దుశ్శా లువాతో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ప్రధానో పాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ తో తగిన నైతిక విలువలతో చక్కటి ప్రణాళికతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరు కుంటారన్నారు.

శ్రీరామ్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సింగ్‌నగర్ శ్రీరామ్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ బోని సురేష్ కుమార్, డైరెక్టర్ బోని మాధురి తెలిపారు. పాఠశాల ఆవరణలో ప్రతిభావంతులైన విద్యార్థులకు అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 594 మార్కులకు పఠాన్ అజ్మీర్ ఖాన్, 593 మార్కులతో డి.లేఖ శ్రీ అత్యుత్తమ మార్కులు సాధించారని తెలిపారు. 580కిపైగా మార్కులు 10 మంది విద్యార్థులు సాధించగా, 500 పైగా మార్కులు 60 మంది విద్యార్థులు సాధించారన్నారు. శ్రీ రామ్ స్కూల్ నుండి 126 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 99.06 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల శ్రద్ధ ఉత్తమ ఫలితాలకు కారణం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ చూపిన శ్రీరామ్ స్కూల్ విద్యార్థులో యాజమాన్యం

శ్రీ విద్యా సంస్థల ప్రతిభ

ప్రజాశక్తి - నందిగామ : 2023-2024 పదో తరగతి ఫలితాల్లో శ్రీ విద్య హైస్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని పాఠశాల చైర్మన్ కందుల మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు ఎస్.మురళీధర్ రెడ్డి 587/600, శ్రీ లాస్య 586/600 మార్కులు సాధించి నందిగామ టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. 580 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 10 మంది, 550 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 44 మంది, 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 93 మంది ఉన్నారని తెలిపారు. ఈ ఘనతను సాధించిన విద్యార్థులను శ్రీ విద్య హై స్కూల్ చైర్మన్ కందుల మల్లిఖార్జునరావు, డైరెక్టర్ రాము, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. నందిగామ మండలం మాగల్లు గ్రామానికి చెందిన కస్తాల నూతన ప్రసాద్ (అడ్వకేట్) కుమారుడు కస్తాల జయదీప్ 578 మార్కులు సాధించాడు. మాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ కస్తాల జయదీప్ అతి సామాన్య కుటుంబంలో పుట్టి ఎంత ఉన్నత విలువలు కలిగి క్రమశిక్షణతో చదువుకొని గవర్నమెంట్ స్కూల్లో కూడా ఇలాంటి ఫలితాలు రాబట్టవచ్చని నిరూపించాడన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.